

# ఈ ప్రవాహం ఆపవద్దు

వేదవతీదేవి

టీ కప్పు బల్ల మీదపెట్టి సిగరెట్ పెట్టె తీశాను. సిగరెట్ నోట్లో పెట్టుకుని లైటర్ కోసం డ్రాయర్ సొరుగు తీసి వెతుకుతున్నాను. స్ప్రింగ్‌డోర్ ఒక్క ఊపున తెరుచుకుంది.

చిరాగ్గా తలెత్తి చూచాను.

"మే ఐ కమిన్ సర్... అంటూ పర్మిషన్ అడక్కుండా లోపలకు వచ్చే వాళ్ళంటే నాకు కోపం- స్టాఫ్ ఎవరికీ అలా తలుపుతీసుకుని వచ్చే దమ్ముల్లేవు-

ముఖం నిండా నవ్వు పులుముకుని రఘుపతి వచ్చాడు లోపలికి—

"ఓర్నీ ! నువ్వట్రా ! కమాన్—కమాన్ !" అంటూ వాడి భుజం మీద చెయ్యేసి కుర్చీలో కూలేశాను.

బల్ల నీట్‌గా, ఖాళీగా ఉంది- సంతకాలు పెట్టాల్సిన కాయితాలూ గట్రా ఏమీ లేవు-

"పని ముగించేసేవేమిటి ఇవాల్టికి ! ఖాళీగా కూర్చున్నావు !"...అన్నాడు వాడు-

నేను టేబిల్ మీద బెల్ బటన్‌నొక్కాను- రంగస్వామికి టీ తెమ్మని చెప్పి, టెలిఫోన్ రిసీవర్ ఎత్తి ఇంటికి డయల్ చేశాను-

"హలో..." వీణమీటినట్లు కమల స్వరం వినిపించింది-

నలభయ్యో పడిలో పడ్డా- మనిషికాస్త లావెక్కింది- కాని, కమల కంఠస్వరంలో మాత్రం మార్పు రాలేదు— కమ్మెచ్చున తీసిన తీగలా సన్నగా ఉంటుంది— ఫోన్‌లో అయితే మరీని—

"హాయ్ ! కమలా ! నేనే ! అతిథి దేవుడొచ్చాడు. రాత్రికి భోజనం సిద్ధంచేయి"... అన్నాను.

"ఎవరేమిటండీ !"

"ఎవరా !"...అంటూ రఘువంక నవ్వుతూ చూశాను.

వాడిమొహంలో కుతూహలం. అప్పుడే రంగస్వామి తెచ్చిన టీ కప్పు సిప్‌చేస్తూ నా

వంక చూస్తున్నాడు.

"ఎవడో! గాసర బీసర ఘూర్జర దేశం వాడు"...అన్నాను - "బీసర-ఘూర్జర"... అనే మాటలు మధ్యాక్షరాల్ని వొత్తిపలుకుతూ.

"తెలిసింది లెండి"... అంది కమల నవ్వుతూ-

రఘుని చూస్తే చాలు-ఏమిటో చిన్నవాడి నయిపోతాను- వాడంటే నా కుండే చనవు, ఉత్సాహం, ఆప్యాయత-అలాంటివి-

వాడూ అంతే! ఆత్మీయత గూడు కట్టి నట్లుంటాడు- మా ఇద్దరి మధ్యా స్నేహం ఈ నాటిదికాదు- ఇరవై ఏళ్ళకిత్రితం మేమిద్దరం కాలేజీ చనువు వెలగ బెట్టినప్పటి నుంచీ ఆరంభమైంది- అది మొదట్లో సన్నని లతగా ఏర్పడినా ఇద్దరం కాలేజీలు వదిలిపెట్టి జీవితంలో స్థిరపడే రోజులు వచ్చిన దగ్గరనుంచీ మరీ బలపడింది- గాఢంగా బలంగా నాటుకు పోయిన మా స్నేహబంధం ఇప్పుడుఅభేద్యం అనే చెప్పాలి-

ఈ ఆత్మీయతలోని మాధుర్యం ఎవరికి వారికి అనుభవంలోకి రావలసిందే తప్ప వర్ణించి చెప్పటానికి వీలయ్యేదికాదు-

అటూ ఇటూ అర్ధశతాబ్దానికి దగ్గరపడుతు న్నాం- కణతల దగ్గరా, తల ముందు భాగం లోనూ, వెంట్రుకలు తెల్లరంగు వేసుకోవటం మొదలు పెట్టి చాలా రోజులైంది.

వాడూ నేనూ-అనేకంటే వాడికుటుంబమూ నా కుటుంబమూ పాలల్లో నీళ్ళల్లా కలిసి పోయారు. మా ఇద్దరి మధ్యా అరమరికల్లేవు.

మేం తరచూ కలుసుకోవటం పడదు. వాడు నాకు అయిదు గంటలు దూరం. అంటే వాడి ఊరికి వెళ్ళాలంటే అయిదు గంటలు ప్రయాణం చేయాలి.

యాభై ఎకరాల ఆసామీ వాడు. స్వంత వ్యవసాయం. ఎప్పుడూ ఏవో పొలం పనులు ఉన్నాయంటూ బిజీగా ఉంటాడు. కమతగాళ్ళు, పాడి, పంటా, ఎరువులు, విత్తనాలు,ట్రాక్టర్లు ఈ లోకంలో ఉంటాడు.

నా ప్రపంచం వేరు.కంపెనీ విషయాలూ, బిజినెస్ మీటింగ్సూ, ఆఫీస్ రొటీన్, వీటిల్లో తలమున్కలుగా ఉంటాన్నేను. ఉదయం పది గంటలదగ్గర్నుంచీ సాయంత్రం అయిదు ఆరు గంటల వరకూ ఇదే ప్రపంచం. ఏ క్లబ్‌కో బిజినెస్ ఫ్రెండ్స్‌ని కలుసుకోవటానికో సాయంత్రాలు వెళ్ళానంటే రాత్రి బాగాప్రొద్దు పోయాకే ఇంటికి చేరడం.

కాని సంవత్సరానికి రెండుమూడుసార్లన్నా రఘూతో కొంతకాలం గడపటం తప్పని సరిగా వస్తున్న ఆచారం.

వాడు సిటీలో ఏదయినా పనితగిలినప్పుడో వ్యవసాయపు పనులు కాస్త తెరిపి ఇచ్చిన ప్పుడో-ఇట్లాగే హఠాత్తుగా ఊడిపడతాడు. ఒక్కొక్కసారి భార్యా సమేతంగా వస్తాడు.

వాడు వచ్చేడంటే, కంపెనీ వ్యవహారాల్తో వేడెక్కి పోయిన నా బుర్రమీదసన్నటిమంచు తుంపరలుచల్లినట్లవుతుంది. మనస్సులోఏదో హుషారు పుట్టుకువస్తుంది.


phones : Shop : 3416
Resi : 4155

**MVR**

**MANDAVILLI VEERRAJU**

**Merchants, Pulses, Dhalls & Oilcakes Etc.,**

**OLD POST OFFICE STREET**
**KAKINADA-533 001** (ANDHRA PRADESH)



**The Andhra Pradesh Minning Corporation Limited**

| | 1973-74 | 1974-75 | 1975-76 *(Half Year)* |
|---|---|---|---|
| Turn over (Rs. In Lakhs) | 16 | 31.7 | 27 |
| Profit (Rs. In Lakhs) | 2·4 | 5·4 | 7.5 |

(Provisional)

SUPPLIERS OF

• Chrysotile Asbestos • Barytes • Clays • Serpentine •Cuartz

సంవత్సరానికి ఒకసారైనా, ఏ వేసవి తాపమో వెంటపెట్టుకుని ఒక్కొక్కసారి ఒంటరిగానూ, ఒక్కొక్కసారి సకుటుంబంగానూ మిడిమేళంగా వాడి ఇంటిమీదకు వెళ్ళిపడటం నాకూ అలవాటే అక్కడి కొబ్బరి నీళ్ళూ, మామిడితోటల నీడా, తోడంటు గడ్డ పెరుగు మీద మీగడ మా అందరికీ ఇష్టం.

టీ కప్పు టేబిల్ మీద పెట్టాడు రఘు. సిగరెట్ అందించాను. మామూలుగా వాడు తాగకపోయినా, నేనిస్తే వద్దనడు. మేం ఇద్దరమూ కలిసి ఉన్నంత వరకూ అది ఒక లైసెన్స్ వాడికి. అలా అని వాడి భార్యకు ఎప్పుడో చెప్పి పెట్టాను.

"ఎక్స్‌క్యూజ్‌మి సర్"... స్ప్రింగుడోర్ సన్నగా తెరుచుకుంది.

"యస్...కమిన్ ప్లీజ్"...అన్నాను.

రామలక్ష్మి వచ్చింది. అంతకు ముందు నేను చెప్పిన షార్ట్‌నోట్స్ టైప్ చేసిన కాయితాలు పట్టుకుని.

"ఆఁ...గుడ్... అయిపోయిందా ! వీటి కోసమే ఎదురు చూస్తున్నాను. ఇలా ఇవ్వండి" అంటూ కాయితాల మీద చకచకా సంతకాలు పెట్టేశాను.

"ఇవి డిస్పాచ్ సెక్షన్‌కిపంపించెయ్యండి. ఇవాళే పోస్ట్‌లో వెళ్ళి పోవాలి మరి."అంటూ లేచాను.

"యస్ సర్..." అంటూ రామలక్ష్మి వెళ్ళి పోయింది.

"ఈ అమ్మాయిది మా ఊరే. ఎన్నాళ్ళయిందిరా ఇక్కడ చేరి?"... అన్నాడు రఘు ఆమె వెళ్ళాక.


"అలాగా ! ఎరుగుదువా ఏమిటి ! ఈమధ్య అయిదారు నెలలయిందిలే చేరి. పలకరించలేదేం మరి ?"

"చిన్నపిల్లప్పుడు చూచాలే. పెద్దదిగినాక— ఎక్కడా మాది పల్లెటూరుగా ... మొగాళ్ళకి ఆడపిల్లలు ఎదురు పడరు !"... అంటూ నవ్వాడు మళ్ళీ.

"బసీ...ఆ పిల్ల నిన్నుగుర్తు పట్టినట్లేలేదు అందుకే కాబోలు"

"కాని మా పల్లెటూళ్ళల్లో సంగతులుగమ్మత్తుగా ఉంటాయిలే, మొగాళ్ళూ ఆడాళ్ళూఎదురు పడరు. ఆడాళ్ళు చాటుకు పోతారు. అయినా ఊళ్ళో అందరి సంగతులూ అందరికీ తెలుస్తాయి. ఎవరు ఎవరో ఎవరెట్లాటి వాళ్ళో కూలంకషంగా తెలీకుండా ఉండదు. పాపం, ఈ రామలక్ష్మిది...ఒక కథలే. ఒకందుకు ఎడ్మైర్ చేయవచ్చు మనం"

"పద పద...ఇంటి దగ్గర చెబుదువుగాని




కథలు"...కార్ కీస్ తీసుకుని డ్రాయర్‌తాళం వేసి లేచాను.

ఇవాళిహ క్లబ్‌కి వెళ్ళే ఆలోచన లేదు. కారు సరాసరి ఇంటి దారి పట్టించాను.

పెద్దమ్మాయి రాజేశ్వరి హాల్లోనుంచే మమ్మల్ని చూసింది గావును-వరండాలోకి ఎదురు వచ్చి-

"హల్లో అంకుల్ ! నమస్తే ! ఇదేనా రావడం !" అంటూ పలకరించింది.

"హల్లో రాజూ ! నీకోసం మీ అత్తయ్య జున్నుగడ్డలు పంపిందోయ్ ! నిన్నుచూ సేగురు వచ్చింది. బస్టాండ్ దగ్గర స్వరాజ్ హోటల్లో పెట్టాను. వీరన్నని పంపించి బుట్టా నా సూట్ కేసూఉంది తెప్పించు- క్విక్ !" అన్నాడు రఘు,

'క్విక్ !..." అని చెప్పఖ్ఖర్లేదు. రాజీకి జున్ను అంటే ప్రాణం. రఘూ అంకుల్‌వచ్చాడంటే దానికి జున్ను దొరికిందన్న మాటే. సరిగ్గా వీడు సిటీకి ప్రయాణం కట్టేముందే గొడ్లచావిట్లో గేదె ఈనుతుందా—అని సందేహం అక్కర్లేదు. రఘూ గొడ్లచావిట్లో గేదెలు చాలానే ఉన్నాయి. ఏదో ఒకటి వీడి ప్రయాణం రోజుకి దూడను పెట్టేసి పుణ్యం కట్టుకోకపోదు. బర్రె ఈనిన రోజే వీడికి సిటీకి వచ్చే పని తగలకుండానూ ఉండకపోదు. ఏది ఏమైనా, రఘూ వచ్చాడంటే రాజీకిజున్ను గడ్డఅందటం ఎంతఖాయమో, చిన్నమ్మాయి త్రిపురకు కోవాబిళ్ళలూ, మా ఆవిడకు రెండు నెలల పాటు చేతినిండా వాడుకోవటానికిఇంట చేసిన కమ్మని నెయ్యీ—అందటం కూడా అంతేఖాయం.

కమల వచ్చింది లోపలనుంచీ చేతులు తుడుచుకుంటూ-

"మా అన్నయ్యకు తడవకొక పేరు పెడతా రేమిటండీ ! ఘూర్జర దేశం వాడేమిటీ ! అసలెక్కడ ఉందీ ఆదేశం ?"... అంది నవ్వుతూ.

"ఆ గాసర బీసర దేశాలన్నీ మనవాడు ఏలివచ్చిన రాజ్యాలేగా అమ్మాయ్ ! వాడికి తెలియక పోటమేమిటి ?" అన్నాడు రఘు సీరియస్‌గా.

అందరం నవ్వుకున్నాము. కాఫీ, ఫలహారాలు అయినాక కమల స్నానాలకు ఏర్పాటు చేసింది. కట్టుదిట్టంగా ప్యాక్‌చేసిన పెద్ద తాటాకు బుట్టతో పాటు రఘూ సూట్‌కేస్ పట్టుకు వచ్చాడు వీరన్న.

స్నానాలు చేసి మేడపైకి వెళ్ళి బాల్కనీలో కుర్చీలు వేయించుకు కూర్చున్నాము. కమల కూడా పైకివచ్చి కూచుంది.

"ఏవిట్రా ఇంకా కబుర్లు ?" అన్నాను.

"రాజూకి ఒక సంబంధం తెచ్చాన్రా ! మా ఊరే ! అంటే కుర్రాడు భిలాయ్‌లో పని చేస్తున్నాడులే. రాజూ అయితే బాగుంటుందని మొన్న ఏదో మాటల్లో అంటే, మీ చెల్లెలు నీ దగ్గరకు వెళ్ళి రమ్మని రోజూ తొందర చేస్తూ ఉంది. నాకే వ్యవసాయపు పనుల్తో వీలుకాక నాల్రోజులు ఆలశ్యం అయింది."

మంచి సంగతే. రాజూకి నిరుటి నుంచీ పెళ్ళి సంబంధాలు చూస్తున్నాను. ఆ ఉద్దేశంతోనే ఇంటర్‌మీడియెట్ కాగానే చదువు మానిపించాను. ఆడపిల్లలకు ఆ మాత్రం చదువు చాలని నా ఉద్దేశం. నాకు ఈ డిగ్రీ చదువుల మీద ఆడపిల్లలకు సంసార జీవితంలో ఏమాత్రమూ ఉపకరించని ఈకాలపు చదువులమీద ఏమీ నమ్మకం లేదు. మరీ అవసరం వస్తే తప్ప ఆడపిల్లలు ఉద్యోగాలు చేయడం కూడా నాకంత ఇష్టమైన పనికాదు.

"ఎవరేమిట్రా మీ ఊళ్ళో ! డిటెయిల్స్ ఏమిటి ?"...అన్నాను ఆసక్తిగా.

"వరుసలు కలిపితే దూరంగా మాకు బంధుత్వం కూడా కలుస్తుందిలే. కుటుంబంమంచిది.

రాఘవరావుగారని మా ఊళ్ళో పాతికెకరాల ఆసామి. ఒక కొడుకు. ఒక కూతురు. కూతురు చిన్నది. హైస్కూలు చదువేదో చదువుతూంది ఇప్పుడప్పుడే పెళ్ళిచేయరులే. బాగా పైకి చదివిస్తారు. అసలు వాళ్ళ ఫామిలీ అంతా బాగా చదువుకున్నవాళ్ళు. పిల్లవాడు ఇంజనీరింగ్ ఫస్ట్‌క్లాస్‌లో పాస్‌అయి భిలాయ్‌లో సంవత్సరం నుంచీ పనిచేస్తున్నాడు"

"కుర్రాణ్ణి ఎరుగుదువా నువ్వు ?"

"ఆఁ... హాండ్సమ్ ఫెలో. మన రాజీకి ఈడూ జోడూ బాగా సరిపోతాడనే అనుకుంటాను"

"కట్నం ?"

"ఎంత చదువుకున్న ఫామిలీ అయినా ఆ విషయంలో మడికట్టుకు కూర్చోలే! డెబ్బై ఎనభై వేల దాకా ఇస్తామని వాస్తూనే ఉన్నారు ఇచ్చేవాళ్ళు ఇస్తామని వాస్తుంటే పుచ్చుకోటానికేం బాధ ? అయితే అచ్చం కట్నం దగ్గర పట్టుకోరులే. మిగతా విషయాలన్నీ నచ్చితే కాస్త అటూ ఇటూ అయినా ఫరవాలేదనుకుంటాను.

"అద్సరే...మరింకా ఎక్కడ సెటిల్ చేసుకోక పోవటానికి కారణం ?"

"వాళ్ళ రిక్వైర్‌మెంట్స్ ఏవో ఉన్నాయి పిల్ల స్మార్ట్‌గా ఉండాలి. సహజమైన కోరికే అనుకో. చదువు కూడా ఉండాలి కనీసం డిగ్రీ—డబుల్ డిగ్రీ అయితే వాళ్ళకు మరీ ఇష్టం. ఇవన్నీ కుదరాలి కదా !"

సిగరెట్ ఆఖరుదమ్ము లాగి ఏష్‌ట్రేలో పడేసి—

"పిల్ల చేత ఉద్యోగం చేయిస్తారా ? లేకపోతే డిగ్రీల మీద మోజా !" అన్నాను.

"ఏమో ! ఉద్యోగం చేయిస్తారని అనుకోను కాని వాళ్ళకు ఉన్నత విద్యంటే, డిగ్రీలంటే అదొక మోజే అను. ఆ కాలానికి పెళ్ళికొడుకు తల్లి కూడా బాగా చదువుకుందట. డిగ్రీల సంగతి ఏమో కాని ఇంగ్లీషు చదువనూ రాయనూ వచ్చు. రాఘవరావు గారు కూడా ఎమ్. ఏ. చేసి వ్యవసాయదారుడిగా మారినతనే.

వాలుకుర్చీలో చేరబడ్డాను. అన్ని విధాలా మంచి సంబంధం లాగే ఉంది. అయితే వాళ్ళకా డిగ్రీమీద వెధవమోజేమిటో !

అసలు నిజం చెప్పాలంటే డిగ్రీలు ఉన్న ఆడపిల్లలకే ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు కావడం కష్టంగా ఉంది. ఆ చదువుల్లో పడి తండ్రి చేతి చమురుతో పాటు వీళ్ళ మిసమిసలాడే వయసుకూడా హరించుకుపోవటం ఆ తర్వాత ఈ పిల్లకంటే ఎక్కువ చదివినవాడి కోసం గాలించ వల్సిరావటం— అప్పుడూ తప్పని కట్నాలు ఈ లోపున అమ్మాయికినడివయస్సు రావటం ఇదంతా ఒక విషవలయంగా, న్యూసెన్స్‌గా కనిపిస్తుంది నాకైతే.

రాజీ ఎలా చెపితే అలా వినేపిల్ల.

"వెధవ డిగ్రీల వల్ల మనకు వొరిగేదేమీ లేదమ్మా ! అంతకన్నా మంచి జనరల్‌నాలెడ్జ ఇచ్చే మంచి పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. ముక్కువ కరుచుకుని పరీక్షలకు కూర్చొనే ఈ చదువుల కన్నా ఎంతో విజ్ఞానం ఇస్తాయని." అని నేననేటప్పటికి ఎదురు జవాబు చెప్పకుండా తల ఊపింది.

రాజీ అయితే ఊరుకుంది కాని కమలకు ఏమీ నచ్చలేదు నా నిర్ణయం.

"పెళ్ళి కుదిరేంత వరకు కాలేజీకి వెళ్ళి వస్తుంటే ఏం ? ఎప్పుడు కుదిరితే అప్పుడే మాన్పించ వచ్చుగా ! ఇంట్లో కూర్చుంటే దానికేం పొద్దుపోతుంది !" అన్నది.


*With the Best Compliments From*

Phone: **53**

# Dwaraka Pottery Works, Bhimadole

(ESTD **1945**) W. G. Dt. (A. P.)

MANUFACTURERS OF: ALL GRADES OF REFRACTORIES, STONEWARE JARS, FIRECLAY, MORTOR SANITARY WARE, ACID RESISTING AND INSULATING BRICKS ETC.

*With the Best Compliments from*

# M/s. Rao & Rao Enterprises

**(Dealers In Empty Cement Gunnies)**

**LABBIPET :: VIJAYAWADA-520 010** (A. P.)

"ఎలాగూ మనం ఈ సంవత్సరమో పై సంవత్సరమో పెళ్ళి చేయాలను కున్నప్పుడు చేర్పటం మానిపించటం ఎందుకులెస్తూ ఈ లోపున వంటా ఇంటి పనులూ నేర్పుతూ ఉండు !" అన్నాను.

"రాజుకి ఇప్పుడే చదువు మానిపించేయట మేమిట్రా! ఏం కాలం వాడివి నువ్వు! దాని తోటి పిల్లలందరూ బి. ఏ. లు బి. యస్. సి. చదువుతుంటే దాన్ని ఇంట్లో కూర్చో పెడితే ఏం తోస్తుంది. పిల్లలకు ఏదో ఒక వ్యాపక మంటూ ఉండాలి. ఈ విద్యా విధానం బాగుం దని నేనూ అనటం లేదులే ! కాలాన్ని బట్టి మనమూ సాగిపోవాలిగా !"... అంటూ నన్ను కన్విన్స్ చేయాలని చూచాడు రఘు.

ఇంట్లోనూ బయటా, నేనెంత ఫార్వర్డ్‌గా ఉన్నట్లు కనిపించినా, కొన్నికొన్ని విషయాల్లో పాతకాలపు పద్ధతులే మంచివనే అభిప్రాయాలు కలవాడిని. మరీ ఈ కుర్రకారు కాలేజీల్లో అఘోరించే పిచ్చి వేషాలు చూస్తుంటే నాకు ఒళ్ళు మంటగా ఉంటుంది. కాలేజీలో అడుగు పెట్టారో లేదో ప్రేమకలాపాలు, మాడ్ డ్రెస్‌లు, మినీ డ్రెస్‌లు, టీజింగ్, రాగింగ్ సినిమాలు, షికార్లు, హిప్పీయిజమ్-వెధవ్వేషాలు వేస్తూను, చదువు సంగతిదేవుడెరుగును కాని ఈ కళ్మలంలోకి ఆడపిల్లల్ని పంపించక పోవటమే మంచిదని నాకు నాటుకు పోయింది.

చిన్నపిల్ల త్రిపుర సుందరి మాత్రం ఈ విషయాలు నన్నుబాగా ఎదిరించింది.

"ఏమిటి డాడీ ! అక్క ఊరుకుందని నేనూ ఊరు కుంటాననుకున్నారేమో ! అక్కను ముసలమ్మను చేసి కూచో పెట్టారు. ఎవరైనా 'మీ అక్క ఏం చదువుతుందని' అడిగితే అవ్వ! ఏం చెప్పాలి నేను పెళ్ళి కొడుకొక్కసంఎదురు చూస్తూ ఇంట్లో కూర్చుందని చెప్పనా ? ఛీ! సిగ్గుచేటు"...అంటూ హఠం చేసింది.

ఎవరేమన్నా రాజీ నా మాటను ఎదురుచెప్ప లేదని ఒక గర్వం. నా అభిప్రాయాలకు ప్రతీకగా నడుచుకునే రాజీ మీద నా కొక అభిమానం, కాలేజీలోనేర్చుకోబోయేపాఠాలకన్నా జీవితంలో నేర్చుకోవలసిన పాఠాలే ఎక్కువగా ఉన్నాయనీ అవి రాజీ చక్కగా నేర్చుకుంటుందనీ సంతృప్తితో మంచి కుర్రాడి కోసం గాలిస్తున్నాను.

"మనందరం చెపితే విన్నారా అన్నయ్యా! నిరుడు బి. ఏ. చేర్పించి ఉన్నట్లతే ఈపాటికి ఒక సంవత్సరం అయిపోయేది- డిగ్రీ ఇంకా ఇంకారాకపోయినా, చదువుతుందనైనా చెప్పటానికి వీలయేది !"...అన్నది కమల నావంక నిష్ఠూరంగా చూస్తూ-

"మరి వాళ్ళకా చదువు మీద అంతపట్టింపుగా ఉంటే మనం పిల్లనిస్తామని అడగటం మాత్రం ఎందుకురా !" అన్నాను రఘువైపు తిరిగి-

"ఏదో చూద్దాములే- మిగతావిషయాలన్నీ ఉభయులకు నచ్చితే, ఈ విషయం ఎలాగో సర్దుబాటు చేయవచ్చని అనుకొన్నాను"

"అన్ని విధాలా బాగుందని చెపుతున్నావు కదురా ! నువ్వే ఆ రాయబారం ఏదోనడుపు ఆ చదువు సంగతేదో వాళ్ళు ఒప్పుకుంటే మంచిదే. అంతగా కావాలంటే పెళ్ళయిన తర్వాత ప్రైవేట్‌గాపరీక్షకూర్చోపెట్టుకోవచ్చుగా !" అన్నాను-

ఒక్కొక్కంగతో రెండేసి మెట్లు దూకుతూ పైకి రివ్వున దూసుకు వచ్చింది త్రిపుర సుందరి చేతిలో కోవా బిళ్ళలు కొరుక్కుతింటూ-

"అంకుల్ డియర్ ! థాంక్యూ థ్యాంకూ వెరీమచ్ ! ఆర్నెల్లైపోయింది.ఎప్పుడువస్తావా కోవాబిళ్ళ లెప్పుడెప్పుడుతెస్తావాఅని చంద్రుడి కోసం చకోరంలా ఎదురు చూస్తున్నానుకో"

రఘు ఫకాలు మని నవ్వి"చంద్రుడికోసం చకోరం ఎందుకు ఎదురు చూస్తుందో తెలుసటే చిట్టీ !"...అన్నాడు.

అందరం నవ్వాము. దీనికి నోటి తొందర మహా ఎక్కువ. ఎంతతోస్తే అంత, ఏదితోస్తే అది అప్పటికప్పుడు చేసేయటం తప్పమరోటి తెలియదు దానికి. వయసు వస్తున్న ఆడపిల్లలా ఉండదు త్రిపుర. దుడుకుగా, చురుకుగా గంతులు వేసే లేగదూడలా ఉంటుంది.

"అవర్ విమెన్ ఇన్ పబ్లిక్ లైఫ్" మీద కాంపిటీటివ్ ఎస్సేలో నాకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. అంకుల్ ! గుడ్ న్యూస్ కదూ !" అంది త్రిపుర పిట్టగోడ మీద కూర్చుంటూ-

"సర్లెస్లీ ! చిట్టీ విల్ ఆల్సో షైన్ ఇన్ పబ్లిక్ లైఫ్, నీ కూతురు ఎప్పుడో ఒకప్పుడు ఈ దేశాన్ని ఏలుతుందిరా ! చెపుతున్నా చూడు !"...అన్నాడు రఘు త్రిపురకు షేక్ హాండ్ ఇస్తూ-

"ఎగ్జాట్లీ ! దటీజ్ మై ఏంబిషన్ ! అంకుల్! చూస్తావుగా ! ముందు ముందు ఏంచేస్తానో ! అక్కలాగా ఇంటర్ కాగానే పెళ్ళికూతురి పోజు లిస్తూ కూర్చుంటా ననుకున్నావా వేమో ! నాపెటాల్ ! ఆఁ ... ఇప్పుడే వస్తా ... సుజాకి ఫోన్ చేయాలి ... డాడీ ... కారీ అన్ ..." ...అంటూ నాచేతిలో నాలుగు కోవాబిళ్ళలుంచి కిందకు గెంతింది త్రిపుర.

కమలకూడా వంటపని కొంచెంమిగిలి పోయిందంటూ క్రిందకు వెళ్ళింది.

"అమ్మయ్య ... గాలివాన వెలసింది. దీనిదొక పెద్ద ప్రాబ్లెమ్ అయేట్లుందిరాభాయ్!" అన్నాను మరొకసిగరెట్ తీస్తూ.

"ప్రాబ్లమ్ ఏమిట్రా నీ ముఖం! రాజేశ్వరి ఎంత నెమ్మదయినపిల్లో త్రిపుర అంతచురుకు దనంకల పిల్ల. ఈ కాలాన్నిబట్టి ఆమాంతం డ్రైవ్ ఆడపిల్లలకు ఉండటం మంచిదే !"

"మరీ అంత నేటు పేలిపోయే సీమటపాకాయ అయితే ఎట్లా గోయ్ !"

---

● వీధిపంపుదగ్గర వినోదంగా కబుర్లాడుకుంటున్న అడమళయాళంలో ఆండాళమ్మగారు అనసూయమ్మతో అంది :

"ఏమమ్మా మీ అమ్మాయికి పెళ్ళిసంబంధాలు వసున్నాయా?...ఎవరికిచ్చి చేస్తారు ?"

అనసూయమ్మ తేలిగ్గా నవ్వేసి అంది :

"ఆఁ ఏ దారినపోయే బైరాగిగాడికో యిచ్చి చేస్తాను లెండి ..."అని.

దారేపోతున్న ఓ బైరాగికి ఆ మాటలు గుడిగంటల్లా మ్రోగి ఆగిపోయాడు. పది నిముషాలు నిలబడ్డాడు, ఏమీ రెస్పాన్సు లేక పోయేసరికి పంపుదగ్గరగావచ్చి అనసూయమ్మతో—

"అమ్మగారూ! నన్ను వుండమంటారా...వెళ్ళమంటారా... నా కవతల బోలెడు పనులున్నాయి!" అన్నాడు ఆశగా చూస్తూ—

—జోషి & మోహన్

"మరేం పరవాలేదు. నీకేంరా అదృష్ట వంతుడివి. ఒకబిడ్డ చల్లగాకురిసే వెన్నెలసోన. మరో బిడ్డకళ్ళు మిరుమిట్లు కొలిపే మెరుపు తీగ!" ... అన్నాడు రఘు ఏదో కవిత్వ ధోరణిలో.

నిజంగానే. త్రిపుర మాటలూ చేష్టలూ, చూస్తూఉంటే, కొంచెం ఆనీజీ గా ఉంటోంది మధ్య. చిన్నదిఅవటం వల్లా, దానితర్వాత మరిపిల్లలు కలగకపోవటం వల్లా — విమలా, నేనూ — దాన్ని. కొంతగారాబం చేసినమాట నిజమే, అయినా, ఇదిఇలా తయారవుతూ ఉండటానికి మేం చేసిన గారాబమే కారణం అనుకోవటానికి నాకు మనసొప్పటం లేదు.

ఈ మధ్య బొట్టు పెట్టుకోవటం మానేసింది ఆడపిల్ల బొట్టు లేకుండా ఉండకూడదనీ., అది ఎప్పట్నుంచో వస్తున్న అచారం అనీతల్లి ఎంతో చెప్పి చూసింది. ఎలాగైనా దానిచేత బొట్టు పెటించాలని నయానా భయానా పోరాడింది.

"ఎందుకు పెట్టుకోవాలేమిటమ్మా బొట్టు! మనకు పుట్టినప్పుడు ఉందా! పోయేటప్పుడూ ఉంటుందా! మగాళ్ళకు అవసరంలేని బొట్టు ఆడాళ్ళకు మాత్రం ఎందుకేమిటి! అన్నీ సిల్లీ ఐడియాస్! మన అమ్మఅమ్మలు ఏదోచేశారని తరతరాలూ గుడ్డిగా అనుసరించాలని ఉందేమిటి! అదేదో మతచిహ్నంగా మొదలు పెట్టారుమనవాళ్ళు! వేరేమతానికీ చెందిందాన్ని కాదు! విశ్వ మానవమతమే నామతం!"

దానికి కాస్త రీజన్ చూపించాలని చాలా ట్రై చేశాను. ఉహుం ... వితండ వాదంలోకి దిగింది.

నాస్తికురాలవుతుందా ఏమిటి! "... అని కమల నెత్తీ నోరూ కొట్టుకుంది.

దానికి తగ్గట్లు క్రిందటి వినాయక చవితి రోజు మామూలుగా నలుగురం కూర్చుని విఘ్నేశ్వర పూజ చేసుకోవటం - తలా ఒక కొబ్బరి కాయ కొట్టటం రివాజే. ఈ సారి మాత్రం త్రిపురను పూజ గదిలోకి రప్పించటం కాని— దానిచేత విఘ్నేశ్వరుడి మీద నాలుగుఅక్షింతగింజలు వేయించటంకాని ఎవరివల్లకాలేదు.

"ఎందుకు మమ్మీ ఈ, తతంగం! ఈ కట్టుకథల్నీ. పురాణాల్నీ గుడ్డిగా అనుసరించటం నాకిష్టం లేదు. ఎక్కడయినా మనిషికి ఏనుగు తలకాయ ఉంటుందా! పైగా గుమ్మడికాయంత పొట్ట ... ఎలుకమీద కూచోటం ... ఆ పొట్టమీదమనం ఉండ్రాళ్ళుఅంటించటం... సిల్లీ! సిల్లియస్ట్ పాజిబుల్ అవతారం!"

అంటూ నవ్వే త్రిపురని ఇంకా బలవంతం చేస్తే మరింకేం అవాకులూ చెవాకులూ పేలుతుందోనని ఎవరిమట్టుకు వాళ్ళే ఊరుకున్నాం.

ఇట్లాంటి పోకిళ్ళే పోతూ ఉంది ఈ మధ్య. క్లాసులో మాత్రం అన్నిట్లో ఫస్టు, ఎమ్మే చదివి ఐ.ఎ.ఎస్ కు కూర్చుంటానంటుంది. పెళ్ళి జన్మలో చేసుకోనంటుంది. "మగతోడు మగతోడు అంటారు, మగతోడు లేకుండా ఆడదిఎందుకు హాయిగా గాలంగడపలేదో నేను నిరూపిస్తాను. మగవాళ్ళంతా దద్దమ్మలే! ఒక్క డాడీ తప్ప! "... అంటూ నామెడ చుట్టూ చేతులు వేసిరాగాలు పోయే త్రిపురను ఎట్లా దారికి తీసుకురాను! తొండముదిరి ఊసరవెల్లి అయేట్లు ఉంది.

"అ నాటి త్రిపురా సురమర్దని నీ ఇంట అవతరించిందేమోరా! కలియుగ త్రిపుర సుం


# SOW THE SEEDS OF YOUR INDUSTRY IN THE RICH SOIL OF ANDHRA PRADESH

## And Reap A Rich Harvest Of Prosperity!

Most lavishly endowed with natural resources Andhra Pradesh offers to industrialists, a rich fertile soil, both in reality as well as figuratively speaking. While there is ample scope for agro-based industries, and industry will take firm roots and prosper.

Come to Andhra Pradesh, the land of plenty and plentiful opportunities Locate your industry in the fifth largest State of India and get a head start in all India market The central location of Andhra Pradesh facilitates easier and speedier transport of materials and finished products by road, rail or sea at lesser costs The seaport at Visakhapatnam and the close proximity of the major ports at Bombay and Madras help to bring the flourishing markets almost to you door step.

*Interested? If you are, why not talk it over with us?*

ANDHRA PRADESH INDUSTRIAL DEVELOPMENT CORPORATION LIMITED

**FATEH MAIDAN ROAD, HYDERABAD-500004 (A P.)**

దరి!"...అన్నాడు రఘు నవ్వుతూ.

"నవ్వటం కాదురా! చిన్న పిల్ల అని ఇగ్నోర్ చేసేట్లు లేదు. బొట్టు పెట్టుకోలేదని విఘ్నేశ్వర పూజ చేయలేదని కాదు నాకు విచారం. అసలీ రిబెలియన్ దేనిమీద అని! ఎందుకూ అని! దాన్నీని పెంచినట్లే పెంచాం దీన్ని కూడా! సాగిపోయే సంప్రదాయాల మీద కసి ఎందుకట్బా ఈ కుర్రకారుకి!"

"సాగిపోయే సంప్రదాయంతో పాటు కిమ్మన కుండా కదిలిపోయే వాళ్ళం నువ్వూ, నేనూ, ఇంకా మనలాంటి వాళ్ళు కొందరూ సమాజం మారటల్లేదట్రా! మన కళ్ళ ముందు పుట్టిన వాళ్ళకి విప్లవం అంటే ఉపిరి తీసు కోవటమే అనుకో".

"ప్రతిదానికీ ఎదురు తిరిగి ఏవిటి వీళ్ళు సాధించేది".

"వీళ్ళు చేసే ప్రతి పనికీ అర్థం, ప్రయోజనం - ఉందని చెప్పలేం కాని — మొత్తానికి కుర్రకారు ఒక చైతన్యంతో కదులుతూ ఉంది. దానికి వాళ్ళెన్నో పేర్లు పెట్టుకుంటారు. విప్లవం అంటారు. మావి స్వతంత్ర భావాలని అంటారు. మాకో ప్రత్యేక వ్యక్తిత్వం కావాలని వాళ్ళ గొడవ. ఈ చైతన్యానికి అడ్డు పడటం నీ వల్లా నావల్లా కాదు."

"మరి త్రిపుర! ఏమీ అడ్డు పడకుండా దాని దారిన దాన్ని పోనివ్వ మంటావా!"

"అంతే మరి! ఒక దారిన పట్టిన ప్రవాహాన్ని మళ్ళించటం ఎంత సాధ్యమో - ఇదీ అంతే. ప్రవాహం దానంతటదే దారి మళ్ళించుకుంటుందనుకో — అదివేరే సంగతి! త్రిపుర తన దారి తాను మలుచుకునే నదీ ప్రవాహం లాంటిది. మీ స్టెనో రామలక్ష్మి లేదు! ... ఆ పిల్లకూడా ఎదురు తిరిగిన పరిస్థితుల్లో స్థిమితంగా నిలబడి తన దారి తను నిర్ణయించుకుని ఇవాళ ఒక మనిషిగా నిలబడింది. అట్లాంటి వ్యక్తిత్వం ఉండాలిరా ఆడదానికైనా మగవాడికైనా!"

రామలక్ష్మి గురించి నాకు పర్సనల్ విషయాలేమి తెలీవు. ఆర్నెల్ల క్రిందట ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళల్లో నుంచి మెరిట్‌బేసిస్ మీద ఆమెను తీసుకున్నాం. పని బాగాచేస్తుంది.

"ఏవిటావిడ చేసిన అడ్వెంచర్ !"... అన్నాను.

వుమెన్స్ లిబ్ అంటూ ఆడవాళ్లు మరీ నెత్తికెక్కుతున్నారనీ, కొన్నేళ్ళపోతే ఉద్యోగాల్లోకాని, సంసారాల్లోకాని మొగాడికి చోటు లేకుండా పోవచ్చునీ నా అభిప్రాయం.

"డాడీ...అంకుల్ !..." మీల్స్ రెడీ! దివి నుండీ భువికి దిగిరండీ దిగి రండీ!"... పాడుకుంటూ పరుగెత్తుకువచ్చింది త్రిపుర.

"మాటలోపాటు పాటలు కూడా నేర్చావా చిట్టి తల్లీ ! అవునుగానీ, నువ్వనే దివి ఎక్కడ ఉంటే? దేవేంద్రుడు రాజ్యంచేసే స్వర్గలోకమేనా నువ్వనుకునే దివి ?" ...అన్నాడు రఘు నా వంక కన్నుగీటి నవ్వుతూ.

"మరీ పాత చింత కాయ పచ్చడి మాటలు చెప్పకు అంకుల్ ! స్వర్గ-నరకం-దేవతలు-ఇవన్నీ వొట్టి కట్టు కథలు. నవ్వు ఆనందం

## ప్రేమం ఖరీదు ఓ జీతం

ఆ రోజంతా రాజూ సతమతమై పోతున్నాడు-
సుందరితో ఎలా చెప్పాలి! చెబితే ఒప్పుకుంటుందా? ఏమంటుందో ఏమో!అని ఒకటేఆలోచన.
ఆ సాయంత్రం సుందరినికలుసుకున్నాడు రాజు.
మంచి మూడ్ చూసి తన మనసులో అభిప్రాయం చెప్పాడు.
"నిన్ను ప్రేమిస్తున్నాను సుందరి! పెళ్ళి చేసుకోదల్చుకున్నాను. నాకోరిక పర్యవసానం ఏమౌతుందో నీ అభిప్రాయంమీద ఆధారపడివుంది" అన్నాడురాజు!
"నా అభిప్రాయంమీద కాదు నీ జీతం ఎంతో దానిమీద ఆధారపడివుంటుంది. తక్కువ సమాధానం చెప్పి చకచకా అక్కణ్నుంచి నడిచి వెళ్ళిపోయింది సుందరి.

—కొప్పరపు శివప్రసాద్

ఎక్కడఉంటే అదే స్వర్గం. దుఃఖం, బాధ ఉండేచోటు నరకం. అసలు ఇవన్నీ కల్పించి పురాణాల్లో..."

"చిట్టీ ! నడుంపట్టుకుపోయిందే. ముసలాణ్ణి అవుతున్నానో ఏమిటో ! కాస్త చెయ్యందించమ్మా !"...అన్నాడు రఘు.

అది వాడి నడుంపట్టుకుపోవటంకాదు-త్రిపురవాక్ప్రవాహానికి అడ్డుకట్టవేయటం.

కమల ఈ పూటస్పెషల్‌వంటకాలుచేసింది. వాళ్ళన్నయ్యకి ఇష్టమైనవి. కాకరకాయ మసాలా కూరి కాయ పళంగా వేయించిన వేపుడూ, కొబ్బరివేసి క్యాబేజ్‌కూరా, కంద గారెలూ సాంబార్, టొమాటోరసం, ఆమ్లెట్, పొదినాకుపచ్చడి — వీటన్నిటితోపాటు తలా రెండు వేడి వేడి పరోటాలూ తిని లేచేటప్పటికి నాకు కాస్త భుక్తాయాసం అనిపించింది.

"చూడరా, నువ్వంటే మీ చెల్లెలికెంత పక్షపాతమో ! అన్నీ నీ కిష్టమైనవంటకాలే చేసింది!"...అన్నాను కమలను ఉడికిస్తూ.

"అందుకే కాబోలు అన్నయ్యా ! ఇవాళ ఈయన ఒక్క కూరా ముట్టుకోలేదు !"... అని కమల సీరియస్‌గా అనేప్పటికి అందరం నవ్వుకుంటూ లేచాము.

పైకి వెళ్ళి కూర్చుని తాంబూలాలువేసుకునేప్పుడుచెప్పాడు రామలక్ష్మి సంగతి. వాళ్ల ఊరేనట. లెఖ్ఖలమాస్టారి అయిదుగురి సంతానంలో పెద్ద పిల్లట. ఎస్.ఎస్. ఎల్.సి.వరకు చదివించి ఆ తర్వాత చదివించే ఓపికలేక మానిపించి రెండేళ్ళు ఇంట్లో ఉంచాడట.

"పెళ్ళి చేయాలనా ?"

"కుదిరేచేయాలనే, కట్నం సమస్యకదా ! ఈ లోపునే ఈ పిల్ల ఇంట్లో ఊరికేకూర్చోలేక మా ఊళ్ళో కొత్తగాపెట్టిన టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోచేరి టైపూ, షార్ట్‌హాండ్, నేర్చుకుని పరీక్షలకివెళ్లింది. మా ఊరి టైప్ ఇన్‌స్టిట్యూట్‌లోచేరింది పరీక్షల్లో నెగ్గింది ఈ పిల్లే ఇంతవరకు మొదటి ఆడపిల్ల-ఆఖరుదీని. మహాచురుకైనదిలే."

"యస్ ! షిఈజ్ వెరీ స్మార్ట్ !"

"ఆ తర్వాత ఏదో దౌర్భాగ్యపు సంబంధం వచ్చింది. కట్నం తక్కువకివచ్చారని ఆశపడి ముందూ వెనుకా ఆలోచించకుండా ముడి పెట్టేశాడు తండ్రి. తండ్రికి తన భారం తగ్గితే తగ్గినట్లే అనుకుందేమో-కిమ్మనకుండా పెళ్ళికి ఒప్పుకుంది. పిల్ల కాపురానికి వెళ్ళాక కాన్నిదాని గొంతు నిలుపునాకోనానని తెలుసుకోలేకపోయాడు మహానుభావుడు."

"ఏంవొచ్చింది తిరుగుడు !"

"ఆ కట్టుకున్నవాడికి అన్ని దుర్గుణాలూ ఉన్నాయట. పేగా ఒత్తి మూర్ఖుడు. ఏ పనీ చేసేవాడుకాదు. ఉద్యోగంకాకపోతే మానె-ఆ ఉన్న నాలుగెకరాలూ దున్నుకోవచ్చుగా ! అది చవగ్గా కౌలుకి పారేసి పేకు అచ్చోసిన ఆంబోతులా ఊరిమీద తిరిగేవాడట. చీట పేకలో ఆ ఉన్నదికాస్త తగలేయటం-అప్పుడప్పుడూ త్రాగిరావటం, ఈ పిల్ల సహించలేక ఏదన్నా అడ్డుచెప్పబోతే చెయ్యిచేసుకోవటం—

ఏదన్నా పనిలో అన్నా దూరితే చీటపేక మానుతాడేమోనని ఎట్లాగన్నావాడు హౌస్

వంచుకునేట్లు చేయాలని ప్రయత్నం చేసి చూచింది—చిన్నదయినా వివేకంఉన్న పిల్ల కనుక ఆ త్రాష్టుడికి బాగుపడే యోగం ఉంటేగా? ఒకనాడు మరీ ఏం బెడిసిందో పెళ్ళాన్ని చచ్చేటట్లు కొట్టి "చచ్చినట్లు నోరుమూసుకుని పడి ఉంటే ఉండు. లేకపోతే నీ దిక్కున్నదగ్గర చావు "అని వెళ్ళగొట్టినంత పని చేశాడట."

"పాపం!"

"కాలికింద చీమలారా నేస్తూ ఉంటే ఎన్నాళ్ళని ఓపిక ఉంటుంది! అందులో మంచి తెలివితేటలు వ్యక్తిత్వం-ఉన్న పిల్ల. రెండేళ్ళ కాపరంతో విసిగిపోయింది. బావుకున్నదేమీలేదు. తెగతెంపులు చేసుకుని సరాసరి పుట్టింటికి వచ్చింది"

"తండ్రి ఏమంటాడు!"

"ఏమంటాడు! తను తొందరపాటుగా పిల్లను గోతిలో దించానని లోలోపల బాధపడి ఉంటాడు. అయినా, కాపురం చెడగొట్టుకోవద్దని ఎట్లాగో ఒకట్లా ఓపిక పట్టి మొగుడిదగ్గరే ఉండటం మంచిదని చెప్పి చూశాడు. ఊళ్లో సరే సరి! కాపరం వదిలేసి వచ్చిందని మొగాళ్ళు రచ్చబండల కచేరీల్లోనూ ఆడాళ్ళు అమ్మలక్కల కబుర్లలోనూ ఆడిపోసుకున్నారనుకో! పల్లెటూరు కదా! ఊరు ఊరంతా చిన్న చూపు చూసింది. అయితే, ఒకందుకు మెచ్చుకోవాల్రా! ఆ పిల్ల మాత్రం తొణకలేదు-బెణకలేదు. ఎవరి ఎత్తిపొడుపుల్నీ ఖాతర్ చేయలేదు 'ఒక్క ఏడాదిపాటు నన్ను భారం అనుకోవద్దు నాన్నా!' అని అడిగిందట. టైపు షార్ట్‌హాండూ హయ్యర్ పాసయింది. ఈ మధ్యనే ఇక్కడ ఉద్యోగం అయి వచ్చి చేరిందని విన్నాను కాని మీ కంపెనీలో అని తెలీదనుకో! ఒక చెల్లెల్నీ, తమ్ముణ్ణీ దగ్గరకు తెచ్చి పెట్టుకుందట. స్వతంత్రంగా బ్రతుకుతూ ఉంది"

"ఎన్నాళ్ళని ఒంటరిగా ఉంటుందంటావు?"

"ఎన్నాళ్ళయినా ఉంటుంది. ఆ దున్నపోతు మొగుడి చేత చావుదెబ్బలు తింటూ గతిలేక పడి ఉండే కంటే నయం కాదూ! ఎప్పటికయినా దిమ్మ తిరిగివస్తే వాడే వస్తాడు. లేకపోతే పెళ్ళికావాలనుకున్నప్పుడు వాడికి విడాకులిచ్చి తనకు నచ్చినవాణ్ణి కట్టుకుంటుంది. ఏం మంచిపని కాదా?"

నేను మాట్లాడలేదు. ఆ పరిస్థితుల్లో—వెనకటి తరం స్త్రీ-మైల్స్ అండ్ సబ్ మిసిల్ వుమన్-నా ఐడియల్ వుమన్ - అయితే వాడి కాళ్ళదగ్గరే పడి ఉండేది. మరో దారీ డొంకా ఉండేది కాదు. ఇదే కాబోలు వీళ్ళ చైతన్యానికీ విప్లవానికీ అర్థం!

"ఆడవాళ్ళంటే అట్లా ఉండాల్రా! నాకు మెచ్చుకోబుద్ధి వేస్తుంది స్పిరిట్ ఉన్న అట్లాంటి వాళ్ళను చూస్తే!"...అన్నాడు మళ్ళీ రఘు.

రెండు రోజులుండి-తన పనులు చూచుకుని, వెళ్ళాడు రఘు. "ఆ సంబంధం సంగతి గట్టిగా కనుక్కో అన్నయ్యా! ఏమాటా ఉత్తరం వ్రాయి ...అని హెచ్చరించింది కమల రఘు వెళ్ళేప్పుడు.

ఆ తర్వాత ఇరవై రోజులక్కానీ వాడిదగ్గర నుంచి ఉత్తరం రాలేదు. విశేషం ఏమీలేదు. వాళ్ళు మన సంబంధానికి అంత సుముఖంగా లేరట. మిగతా అన్ని విషయాలూ నచ్చినా, పిల్ల చదువుదగ్గర పట్టుకుందట. వాళ్ళకి భిలాయ్‌లో ఉన్న కొడుక్కి ఉత్తరం వ్రాసి అతడి అభిప్రాయం కూడా తెలుసుకున్న మీదట తేల్చి చెప్పారట మొన్ననే.

ఇంత చిన్న విషయానికి వాళ్ళు అభ్యంతరం చెప్పటం తనకూ ఆశ్చర్యంగానే ఉందనీ, అయినా విచారించవలసిన పని లేదనీ. రాజాకి మరో మంచి సంబంధం కుదరకపోదనీ-నన్ను ఓదారుస్తూ వ్రాశాడు రఘు. రాజా అలా ఊరికే ఉండటం తనకూ నచ్చలేదనీ, ఈ వేసంగి

ఫోన్: 86-241
నివాసం: 72007

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
రిపబ్లిక్ డే శుభాకాంక్షలు

శ్రీనివాసా
ఆటోమొబైల్ వర్క్స్

బ్లాక్ నెం. 3 : : జవహర్ ఆటోనగర్
విజయవాడ-7

ప్రొప్రయిటర్:
పి. నాగేశ్వరరావు

శలవులుఅయిన తర్వాత కాలేజ్‌లో చేర్పమనీ, మరో మంచి సంబంధం కుదిరేంతవరకూ చదువుకుంటూ ఉంటుందనీ సలహా కూడా ఇచ్చాడు.

"మీ మూర్ఖపుపని వల్లే ఈ సంబంధం కుదిరేంతవరకూ చదువుకుంటూఉంటుందనీ సలహా కూడా ఇచ్చాడు.

"మీ మూర్ఖపు పనివల్లే ఈ సంబంధం కుదరకుండా పోయింది!" అంటూ నన్ను నిష్ఠూరమాడింది కమల.

"ఆవారా ఈవారా చిన్నది మీకు బాగా బుద్ధి చెపుతుంది లెండి!" అన్నది కసి కొద్ది.

ఆ మర్నాడు రామలక్ష్మి నేను డిక్టేట్ చేసిన లెటర్స్ నోట్ చేసుకుని వెళ్ళబోతుంటే పిలిచి,

అన్నట్లు మీరు ఇంటర్‌కు ప్రైవేట్‌గా చదువుతున్నారని చెప్పేరు కదూ! బాగా చదువుతున్నారా?"...అని అడిగాను.

ఆఫీస్ మాటర్స్ తప్ప వ్యక్తిగత విషయాలేవీ ఆమెతో ఇంత వరకూ మాట్లాడలెదు నేను.

బహుశా అందుకే కొంచెం తడబడుతూ తొట్రుపాటుగా అంది. "బాగానే చదువుతున్నాను సార్! నెలరోజుల్లోకి వచ్చాయి పరీక్షలు"...అంది.

"బాగా చదవండి... ఫస్ట్‌ఛాన్స్‌లో పాస్ అయితే బి. ఏ.కి కూడా కట్టుకోవచ్చు.ఎగ్జామ్స్ ముందు అవసరం అయితే ఒక పదిరోజులు లీవ్ తీసుకోండి. బై దిబై...మా పెద్దమ్మాయి ఇంటర్ పూర్తి చేసింది. చిన్నమ్మాయిఇంటర్ చదువుతూంది. మీ కేదైనా హెల్ప్ కావాలంటే గైడ్స్ అవీ ఉంటాయిగా...మా పిల్లలతో కలిసి కంబైన్డ్ స్టడీస్ చేసుకోవచ్చు. ఒకసారిరండి ఇంట్రడ్యూస్ చేస్తాను"...అన్నాను.

"థాంక్యూ సార్!"...అకాస్త మాటకే ఎంతో గ్రేట్‌ఫుల్‌గా చూసి వెళ్ళిపోయింది.

వేసవి తర్వాత కాలేజీలు తెరిచేముందు త్రిపురతో పాటు రాజీకి కూడా అప్లికేషన్ ఫారమ్స్ తెప్పించాను.

"నీవుకూడా అప్లై చేయిరాజీ! బి. ఏ. లో చేరుదువుగాని మరీ తోచకుండా ఉంటోంది. కదూ నీకు?"...అన్నాను.

"అలాగే డాడీ!"... అంటూ ఫారమ్స్ పట్టుకు పోయింది రాజీ.

ఎలా చెపితే అలా వినే పిల్ల అని రాజేశ్వరిని గురించి కొంచెం గర్వంగా ఉండేదినాకు. కాని ఇప్పుడెందుకో వెధవది కొంచెం అసంతృప్తిగా ఉంది.

పిల్లలు కాస్త వ్యక్తిత్వం వచ్చినాక ఎవరి జీవనమార్గం వాళ్ళు నిర్దేశించుకోగల మనోధర్మం కలవాళ్ళుగా ఉంటేనే బాగుంటుందేమో!

పెద్దవాళ్ళ చేతుల్లో కీలు బొమ్మలుగాఉండే కంటే-ఎవరికి కావలసింది వాళ్ళు తెలుసుకుని భవిష్యత్తు దిద్దుకుంటేనే మంచిదేమో!

భేష్! నేను మారుతున్నానా?

ఆ మార్పు రాజీకి ఈ సంబంధం కుదరక పోవటం వల్ల వచ్చిందా?

ఉహూఁ! రాజీకి ఇదికాక పోతే దీని తాతలాంటి సంబంధం వస్తుంది. వచ్చినప్పుడు దాని పెళ్ళి చేస్తాను.

కాని, ఇంకా తనకేం కావాలో దానికే సరిగా తెలియదు-రాజీకి స్వయం నిర్ణయం చేసుకునే చైతన్యంరావాలి దానికి. అందాకా చదువుకుంటుంది ఆ చదువు నా ఉద్దేశంలో ఐడియల్ అయింది అవనీ అవకపోనీ.

ఈ ఆడపిల్లల చదువు 'పెళ్ళి చదువే' అనిపించేది నాకు. కాని ఇప్పుడలా అనిపించటం లేదు. వాళ్ళకు ఒక వ్యక్తిత్వాన్ని ఇచ్చేది ఈ చదువేనేమో!

ఈ కాలానికి పనికి రాని అభిప్రాయాలతో కట్టిపడేయను పిల్లల్ని.

రాజీ పెళ్ళి పెద్ద సమస్య అనిపించటం లేదిప్పుడు నాకు. త్రిపుర రిబెలియక మూడ్ కూడా టాలరేట్ చేస్తున్నానిప్పుడు. ఈ ప్రవాహాన్ని అరికట్టకూడదు. సాగిపోనీయాలి.

...—...

*With the Best CompliMents of*

**M/S. JAMUNA AGENCIES**
**HYDERABAD-VIJAYAWADA**
**M/S. DEEP AGENCIES**
**HYDERABAD-VIJAYAWADA**
**M/S. BHARAT PHARMACEUTICALS**
**HYDERABAD**
**PHARMACEUTICAL DISTRIBUTORS**